సాక్షి
వికారాబాద్
బుధవారం | 17 | సెప్టెంబర్ | 2025



విస్తీర్ణం తగ్గింది..
ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతున్నా దిగుబడి మాత్రం నిలకడగా ఉంటోంది. ఆధునిక పద్ధతులతో ఇది సాధ్యమవుతోంది. 8లో▸



ఉపాధ్యాయుల చేతుల్లోనే..
విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే సత్తా ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



శిథిలావస్థలో భవనం!
యాలాల మండల పరిషత్ కార్యాలయం శిథిలావస్థలోకి చేరి చిన్నపాటి వర్షానికే లీకేజీ అవుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

నేడు విశ్వకర్మ జయంతి

తాండూరు రూరల్: మండలంలోని ఖాంజాపూర్ గుట్ట వద్ద బుధవారం విరాట్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వ బ్రాహ్మణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, యజ్ఞం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి



అనంతగిరి: స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ కొరకు హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శిబిరం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి స్పీకర్ ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో చిన్నపిల్లలు, యుక్త వయస్సు బాలికలు, అన్ని వయస్సు మహిళలకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికారాబాద్‌లో నిర్వహించే మెగా వైద్య శిబిరంతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి రోజూ 8 హెల్త్ క్యాంపులు 12 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

యూరియా కొరత లేదు

డీఏఓ రాజరత్నం



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నవాబుపేట: జిల్లాలో సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని డీఏఓ రాజరత్నం తెలిపారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రస్తుత అవసరాల మేరకు అందుబాటులో ఉందన్నారు. 4.200 లీటర్ల నానో యూరియా సిద్ధంగా ఉందని తెలిపారు. నానో యూరియా వల్ల ఎంతో మేలన్నారు. కార్యక్రమంలో ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావును కలిసిన ఆనంద్



అనంతగిరి: వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలు, పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వారికి ఆనంద్ వివరించినట్లు తెలిసింది.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి

కొందుర్గు: విద్యార్థులు చదువులో మరింత రాణించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య సూచించారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలించడంలో భాగంగా మంగళవారం కొందుర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చౌదరిగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, చౌదరిగూడ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిసరాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలుతీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సివిల్ వర్క్స్, యూడైస్ పీఎం పోషణ్ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త విద్యార్థుల నమోదు, విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను పరిశీలించారు. చౌదరిగూడ పాఠశాలలో విద్యార్థులతోపాటు తరగతి గదిలో కూర్చొని ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు.



వికారాబాద్‌లో దొండేరావ్ జాదవ్ గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాఫలకం



నెహ్రూతో జాదవ్

విమోచన పోరాటంలో మనం

నేడు తెలంగాణ విమోచన దినం

- నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన రోజు
- ఉద్యమంలో జిల్లా వాసులు సైతం..
- ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

వికారాబాద్: నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన రోజిది. రజాకార్ల చేతిలో బందీగా ఉన్న తెలంగాణకు విముక్తి కల్పించడానికి ఎంతోమంది అమరులయ్యారు. భారతదేశానికి స్వాతంత్య్రం ఆగస్టు 15, 1947న సిద్ధిస్తే.. సెప్టెంబరు 17, 1948న ఇండియాలో హైదరాబాద్ సంస్థానం విలీనమైంది. ఈ రోజును తెలంగాణ స్వాతంత్య్ర దినోత్సవంగా జరుపుకోవాలనే డిమాండ్ ఎన్నో సంవత్సరాల నుంచి వస్తోంది. కొన్ని పార్టీలు విమోచన దినంగా పేర్కొంటే.. మరికొన్ని విలీన దినంగా.. ఇంకొందరు విముక్తి దినంగా.. మరికొందరు విద్రోహ దినంగా జరుపుకొంటున్నారు. గత ప్రభుత్వం విలీన దినోత్సవంగా వేడుకలు జరపగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఈ సారి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. 1948లో సైనిక చర్య ద్వారా తెలంగాణ భారత దేశంలో విలీనం కాగా.. 1952లో మొదటి సారి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించారు. 1948 నుంచి 1956 వరకు సెప్టెంబర్ 17వ తేదీని విమోచన దినంగా ప్రజలు జరుపుకొన్నారు. తెలంగాణలోని 10 జిల్లాలతో పాటు కర్ణాటకకు చెందిన గుల్బర్గ, రాయచూర్, బీదర్, మహారాష్ట్రకు చెందిన నందేడ్‌లోనూ వేడుకలు జరుపుకొన్నారు.

మనం సైతం..

సెప్టెంబర్ 17వ తేదీని మతం పేరుతో ముడిపెడుతున్నారని కొన్ని పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నిజాం నవాబుల రాచరిక నిరంకుశ పాలన, రాజాకార్ల పీడ విరగడైన రోజుగా తెలంగాణ విమోచన దినాన్ని వ్యవహరిస్తారు. నిజాం పాలన అంతం కావాలని అక్షరాయుధాలు చేతబట్టి రజాకార్ల చేతిలో షోయబుల్లాఖాన్, ఓ దేశ్‌ముఖ్ దాష్టీకానికి బలైన షేక్‌బందగీ, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న ముఖ్దూం మొయినుద్దీన్ తదితర ముస్లింలు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భాగం రజాకార్ల నుంచి విముక్తి కల్పించడానికి, రజాకార్లు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్ల అరాచకాలను పారద్రోలడానికి ఎంతో మంది ప్రాణాలను సైతం అర్పించారు. ఈ పోరాటంలో వికారాబాద్ ప్రాంతానికి చెందిన వారు కూడా ఎంతో మంది ఉన్నారు. వికారాబాద్‌కు చెందిన నారాయణస్వామి కూడా ఒకరు. చాలామంది అమరులయ్యారు.

జైలుకెళ్లిన దొండేరావ్

వికారాబాద్‌లోని గాంధీ కాలనీకి చెందిన దివంగత దొండేరావ్ జాదవ్ స్వాతంత్రోద్యమం జరుగుతున్న సమయంలో ఈ ప్రాంతంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా గొంతు విప్పారు. వారి అరాచకాలను ప్రజలకు వినిపించారు. దీంతో నిజాం ప్రభుత్వం 1947 సెప్టెంబర్ 17న, ఆయన్ను అరెస్టు చేసి గుల్బర్గా జైలులో ఉంచింది. 1947 ఆగస్టు 15న, దేశమంతటికీ స్వాతంత్య్రం వచ్చినా నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణకు మాత్రం స్వాతంత్య్రం సిద్ధించలేదు. 1948లో సర్దార్ వల్లాబాయ్ పటేల్ జరిపిన సైనిక చర్య ద్వారా నిజాం సంస్థానం తెలంగాణలో విలీనమైంది. దీంతో గుల్బర్గ జైలులో ఉన్న దొండేరావ్‌జాదవ్ కూడా విడుదల అయ్యారు. ఆయనకు నాటి ప్రభుత్వం తామ్రపత్రంతో సత్కరించింది. వికారాబాద్‌లో ఆయన పేరు మీద శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు.

మళ్లీ అల్పాహారం

- మూడు నెలల తర్వాత విద్యార్థులకు రాగిజావ
- ప్రారంభించేందుకు సిద్ధమైన విద్యాశాఖ
- ఎమ్మార్సీలకు చేరిన పౌష్టికాహారం ప్యాకెట్లు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య		
ప్రాథమిక	774	29,185
ప్రాథమికోన్నత	116	7,841
ఉన్నత	176	31,015



తాండూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు విద్యాశాఖ తిరిగి అల్పాహారం ప్రారంభించింది. సర్కారు బడులకు వచ్చే విద్యార్థులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఉదయం అల్పాహారం తీసుకోకుండానే స్కూల్‌కు వస్తుంటారు. దీంతో పాఠాలపై శ్రద్ధ పెట్టడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. మూడు నెలల క్రితం వరకు ఉదయం పూట రాగిజావ ఇచ్చేవారు. ఆ తర్వాత ఆగిపోయింది. విద్యార్థుల పరిస్థితిని అంచనా వేసిన విద్యాశాఖ అల్పాహారం తిరిగి అమలు చేసేందుకుగ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో 1,066 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 68,041 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. విద్యనభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వం 2023లో అల్పాహారం పథకాన్ని ప్రారంభించింది. 2024 – 25 విద్యాసంవత్సరం వరకు రాగి జావ అందించారు. మూడు నెలలుగా అమలు కావడం లేదు. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించిన విద్యాశాఖ తిరిగి రాగిజావ అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రాగిపిండి, బెల్లం, సోయా, బియ్యం, దాల్చినచెక్క, ఉప్పు కలిపిన పొడిని పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఎమ్మార్సీ కార్యాలయాలకు ఈ ప్యాకెట్లు చేరాయి. ఒక్కో ప్యాకెట్‌లో 100 మంది విద్యార్థులకు సరిపడేలా రాగి పిండి ఉన్నట్లు తెలిసింది. ఇక నుంచి జిల్లాలోని విద్యార్థులందరికీ పోషక విలువలు కలిగిన రాగిజావను ఉదయం అల్పాహారంగా అందించనున్నారు.

రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మకం



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్

తాండూరు టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మకం అని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు బాసిన కమ్యూనిస్టు నాయకులకు జోహార్లు అర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులైన రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొయినొద్దీన్, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ, ధర్మభిక్షం, కొమురంభీం వంటి నాయకులు రక్తం చిందించారన్నారు. ఈ పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించతగినదన్నారు. తెలంగాణ రాష్ట్ర స్వాతంత్ర్యాన్ని కొందరు హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించడం దురదృష్టకరమన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, సమానత్వం కోసం పోరాడిన నాటి కమ్యూనిస్టు వీరుల త్యాగాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నసీమా బేగం, లుక్‌మాన్, మల్లేశం, దస్తప్ప, శివ, పుష్ప, హన్మంతు, మంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నేర నియంత్రణలో భేష్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఐజీ తప్సీర్ ఇక్బాల్

- పోలీసుల పనితీరు బాగుందని కితాబు
- డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపాలి
- చన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ తప్సీర్ ఇక్బాల్

పూడూరు: నేరాల నియంత్రణలో జిల్లా పోలీసుల పనితీరు బాగుందని హైదరాబాద్ రేంజ్ డీఐజీ తప్సీర్ ఇక్బాల్ కితాబునిచ్చారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి అడ్డుకట్టకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పాఠశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పని చేసేందుకు వచ్చిన బీహార్, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కార్మికులు మత్తు పదార్థాలు వాడుతున్నట్లు సమాచారం ఉందన్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. అవసరమైతే పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు గ్రామాలు, స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్ర మాదకర ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. నేర నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నేరస్థులకు శిక్ష పడేలా చూడాలని.. అప్పుడే భయం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లగూడలో కొండచిలువ



యాచారం: తాడిపర్తి అనుబంధ గ్రామమైన గొల్లగూడకు కొండ చిలువ రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అటవీ ప్రాంతం, వ్యవసాయ పొలాల పక్కనే ఉన్న గొల్లగూడకు మంగళవారం రాత్రి ఓ కొండ చిలువ వచ్చింది. ఎడ్ల శ్రీరాములు ఇంట్లోకి ప్రవేశించింది. గమనించిన శ్రీరాములు భార్య జ్యోతి కేకలు వేస్తు రోడ్డుపైకి వచ్చింది. దీంతో గ్రామస్తులు దాన్ని బయటకు వచ్చేలా చేసి కొట్టి చంపారు.

పులుమద్దిని సందర్శించిన యూపీ బృందం

అనంతగిరి: వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామాన్ని మంగళవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పంచాయతీరాజ్ విభాగానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కన్సల్టెంట్లు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న క్లీన్ అండ్ గ్రీన్ పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం తిలకించి మొక్కలు ఏపుగా, రకరకాల చెట్లు ఉండటాన్ని పరిశీలించి వాటి నిర్వహణపై ఎంపీడీఓ వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ క్రీడా ప్రాంగణం తిలకించారు. అక్కడి నుంచి గ్రామ పరిసరాల్లోని సోక్‌పిట్స్ పరిశీలించి నిర్వహణ గురించి ఆరా తీశారు. సెగ్రిగేషన్ షెడ్‌లో చెత్త సేకరణ, వేరు చేయడం, నిర్వహణ తెలుసుకున్నారు. గ్రామానికి వస్తున్న ఆదాయ వనరులు, ఖర్చులను గమనించారు. గ్రామంలో చేపడుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి రోడ్లను చూసి ఏ పథకం కింద మంజూరయ్యాయని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట టీజీఐఆర్‌డీ సీఈఓ అనిల్‌కుమార్, డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీఓ దయానంద్, ఏపీఓ శీను, పంచాయతీ కార్యదర్శి శిల్ప, డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పులుమద్దిలో పర్యటిస్తున్న యూపీ పంచాయతీరాజ్ ప్రతినిధులు, అధికారులు

ఆ భూములు మీవి కావు!



కుర్మిద్దలో టీజీఐఐసీ పేరు మీద రికార్డులు మార్చేసిన పట్టా భూమి

యాచారం: ఫార్మా రైతులకు మళ్లీ నోటీసులు జారీ అయ్యాయి. అథారిటీలో జమ చేసిన పరిహారం డబ్బులు ఎందుకు తీసుకోవడం లేదో అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని సీసీఎల్‌ఏ నుంచి వ్యక్తిగత నోటీసులు అందజేస్తున్నారు. అప్పట్లో ఫార్మాసిటీకి స్వచ్ఛందంగా పట్టా భూములిచ్చిన రైతులకు ఎకరాకు రూ.16 లక్షల పరిహారం అందజేశారు. టీజీఐఐసీ పేరు మీద భూరికార్డులు మార్చిన రైతులకు మాత్రం ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారాన్ని అథారిటీలో జమ చేశారు. మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ఎకరాకు 121 గజాల చొప్పున ప్లాట్లు కూడా కేటాయించారు. హైకోర్టు రైతులకు మద్దతుగా టీజీఐఐసీ పేరు మీదున్న భూ రికార్డులను తిరిగి రైతుల పేర్లపై మార్చాలని తీర్పు ఇచ్చినా అధికారులు లెక్క చేయడం లేదు. తాజాగా సీసీఎల్‌ఏ నుంచి నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నగరంలోని సీసీఎల్‌ఏలో వ్యక్తిగతంగా హాజరు కావాలని వ్యక్తిగత నోటీసులు వచ్చాయి. 'భూ రికార్డులు మీ పేర్లపై లేనందున ఇక ఆ భూములు మీవి కావని, ఆ భూములపై మీకు హక్కు లేదని.. అథారిటీలో జమ చేసిన డబ్బులే మీవి' అంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అథారిటీలో జమ చేసిన డబ్బులు తీసుకోకపోతే ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాల్సి వస్తుందన్నారు. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది.

న్యాయం చేయండి సారూ..

సీసీఎల్‌ఏ నుంచి నోటీసులు అందుకున్న నాలుగు గ్రామాల రైతులు మంగళవారం నగరంలోని రైతు కమిషన్ కార్యాలయంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని కలిశారు. మీరే న్యాయం చేయాలని విన్నవించారు. పరిహారం డబ్బులు అథారిటీలో జమ చేసిన విషయం ప్రత్యేక కోర్టు పరిధిలో ఉందని, రైతులకు అన్యాయం జరగకుండా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ప్రొఫెసర్ కోదండరాం కలిసిన రైతులు తమ గోడు వెలిబుచ్చారు.

చిరుత కలకలం



చిరుత సంచరించిన ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

- సిద్ధన్నమడుగు తండా శివారులో పాదముద్రల గుర్తింపు
- అప్రమత్తంగా ఉండాలన్న ఫారెస్ట్ అధికారులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం నాగులపల్లి అటవీ ప్రాంత సమీపంలోని సిద్ధన్నమడుగు తండా శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు, పశువులు మేపేందుకు కాపరులు జంకుతున్నారు. తండా సమీపంలోని నీటికుంట, పొలాల్లో చిరుత పాదముద్రలను రైతులు గుర్తించి తాండూరు ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సరస్వతి, ఎఫ్ఎస్ఓ స్వప్న, ఎఫ్‌బీఓ నాగసాయి రైతులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత పాదముద్రలుగా నిర్ధారించారు. నాగులపల్లి అటవీ ప్రాంతం మీదుగా కర్ణాటక వైపు వెళ్లినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అడవి వైపు వెళ్లొద్దు

చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో పెద్దేముల్, తాండూరు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు తెలిపారు. పెద్దేముల్ మండలం నాగులపల్లి, రుద్రాం, ఇందూర్, ఆత్కూర్, సిద్ధన్నమడుగు తండా, ఎర్రగడ్డతండా, తట్టెపల్లి, పాషాపూర్, అడికిచెర్ల, బాయిమీదితండా తోపాటు తాండూరు మండలం గుండ్లమడుగు తండా, మైసమ్మతండా, ఉద్దాండపూర్ వాసులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలన్నారు.



పొలంలో చిరుత పాదముద్ర

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వివాహిత మృతి


సావిత్రి(ఫైల్)

యాలాల: ఆత్మహత్యకు యత్నించిన వివాహిత చికిత్సపొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అక్కంపల్లికి చెందిన వడ్డే సావిత్రి(38), మల్లేశ్ దంపతులు. తాగుడు బానిసైన మల్లేశ్ తరచూ భార్యపై చేయిచేసుకుంటున్నాడు. ఆమె ఆడపడచులు పెంటమ్మ, అంజమ్మ సైతం వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన మల్లేశ్ మద్యం మత్తులో సావిత్రిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్థాపం చెందిన ఆమె అదే రోజు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృతి చెందింది. మృతురాలి తల్లి వడ్డే రాములమ్మ ఫిర్యాదు మేరకు భర్త మల్లేష్‌తో పాటు ఆడపడుచులు పెంటమ్మ, అంజమ్మలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

యాలాల: అనుమతి లేకుండా ఎర్రమట్టి రవాణా చేస్తున్న ఐదు టిప్పర్లను యాలాల పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దౌలాపూర్ శివారులో ఎర్రమట్టి తవ్వి తరలిస్తున్నారనే సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా నాలుగు ఎర్రమట్టిలోడ్‌తో ఉన్న టిప్పర్లతో పాటు మరో టిప్పరును పట్టుకున్నారు. సీజ్ చేసిన వాహనాలను ఠాణాకు తరలించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తున్న వాహనాలపై సంబంధిత శాఖకు అప్పగించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

చంద్రవంచ ఘటనలో మరో పది మందిపై కేసు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచలో వారం రోజుల క్రితం జరిగిన ఇరువర్గాల ఘర్షణలో మరో పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాథోడ్ వినోద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామంలో చోటుచేసుకున్న గొడవలో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ విషయమై ఇప్పటికే 33 మందిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బందోబస్తులో ఉన్న కానిస్టేబుల్ సెల్ ఫోన్‌లోని వీడియోల ఆధారంగా మంగళవారం మరో పది మందిపై కేసులు నమోదు చేశారు. వీరంతా పరారీలో ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ కేసులో ఉన్నవారి సంఖ్య 43కు చేరింది. గ్రామానికి చెందిన 33 మంది జైలులో ఉండటం, మరో పది మంది ఊరు విడిచి పారిపోవడంతో స్థానికంగా ఉద్విగ్న పరిస్థితి నెలకొంది.

బస్సులో మర్చిపోయిన సెల్‌ఫోన్ అప్పగింత


ఫోన్ అప్పగిస్తున్న కండక్టర్

పరిగి: ఓ ప్రయాణికురాలు బస్సులో మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను విధుల్లో ఉన్న కండక్టర్ ఆమెకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గడిసింగాపూర్‌కు చెందిన స్వేత మంగళవారం మెహిదీపట్నంలో బస్సు ఎక్కి స్వగ్రామంలో దిగింది. ఈ సమయంలో తన సెల్‌ఫోన్‌ను సీట్లోనే మర్చిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఇది గమనించిన కండక్టర్ లక్ష్మి స్టేషన్ మేనేజర్‌కు విషయం చెప్పి, బాధితురాలికి ఫోన్ అప్పగించింది.

ఇబ్రహీంపట్నంలో అమానుషం

ఇబ్రహీంపట్నం రూరల్: బస్టాండ్ సమీపంలో నిద్రిస్తున్న యాచకురాలిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాచకురాలైన వృద్ధ మహిళ బస్టాండ్ ఆవరణలోని శ్రీవెంకటేశ్వర మొబైల్ షాపు ఎదుట నిద్రిస్తుండగా రాత్రి 2:45 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బలవంతం చేశాడు. బాధితురాలు పెద్దగా కేకలు పెడుతూ ప్రతిఘటించినా, దాడి చేసి అత్యాచారానికి ఒడిగట్టాడు. పెనుగులాటలో వృద్ధురాలి తలను నేలకేసి కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఉదయాన్నే అటుగా వెళ్తున్న వారు రక్తపు మడుగులో పడి అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మొదటి జారి పడి ఉంటుందని భావించిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి నిర్ఘాంతపోయారు. వెంటనే ఆమెను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

నాలుగు బృందాలతో గాలింపు

యాచకురాలిపై దాడికి పాల్పడిన నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీలు, సెల్‌ఫోన్ సిగ్నల్, లొకేషన్ల ఆధారంగా గాలింపు చేపట్టారు. నిందితుడు మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రస్తుతం అతను పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

విస్తీర్ణం తగ్గింది.. దిగుబడి పెరిగింది


స్టేకింగ్ పద్ధతిలో టమాట సాగు


బెడ్ పద్ధతిలో పసుపు సాగు

సంప్రదాయ పద్ధతులకు స్వస్తి
- ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో అధిక లాభాలు

మోమిన్‌పేట: ప్రతీ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గుతున్నా దిగుబడులు నిలకడగా ఉంటున్నాయి. సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతులు జోడించడంతో అధిక దిగుబడులు వస్తున్నాయి. కూరగాయల సాగులో బెడ్, మల్చింగ్, పందిరి, స్టేకింగ్, బిందు, తుంపర సేద్య పద్ధతులతో ఈ దిగుబడులు సాధ్యమవుతున్నాయని కర్షకులు వెల్లడిస్తున్నారు.

మండల వివరాలు

విస్తీర్ణం	45,142
పట్టభూములు	32,884 ఎకరాలు
ప్రభుత్వ భూములు	12,259 ఎకరాలు
సాగు విస్తీర్ణం	37,250 ఎకరాలు
	23,500 (ప్రస్తుతం)

రెట్టింపు దిగుబడులు

బెడ్ పద్ధతిలో పసుపు సాగు చేపట్టడంతో ఎకరాకు 40క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా సాగుకు పెట్టుబడులు పెరిగినా.. దిగుబడులు రెట్టింపు రావడంతో ఇబ్బందులు లేవంటున్నారు. టమాట ఎకరాకు సాగు చేస్తే పది టన్నుల దిగుబడులు కష్టమే. కాని బెడ్, మల్చింగ్, ట్రేకింగ్ ద్వారా సాగు చేస్తే 50టన్నుల వరకు సాధ్యమంటున్నారు. పసుపు సాంప్రదాయ పద్ధతిలో ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల విత్తనం విత్తుకుంటే 12–15క్వింటాళ్లు గగనమే. కాని ప్రస్తుతం బెడ్, డ్రిప్ పద్ధతిలో తక్కువ విత్తనాలు విత్తుకున్నప్పటికీ 40క్వింటాళ్ల ధాన్యం దిగుబడి చేస్తున్నామని వివరించారు. సాగు విస్తీర్ణం సుమారు 12వేల ఎకరాలు తగ్గినా దిగుబడులు తగ్గడం లేదు. రైతులు పూర్తి ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి సాగు చేయడం తోనే సాధ్యమవుతుంది.

ఒక ఎకరాలో పదెకరాల దిగుబడి



20 ఏళ్ల నుంచి టమాట, వంకాయ సాగు చేస్తున్నా. గతంలో ఎకరా టమాటను సాగు చేస్తే రూ.5వేల పెట్టుబడి వచ్చేది. దిగుబడులు మాత్రం పది టన్నులు దాటేదికాదు. ఆరేళ్ల నుంచి ట్రేకింగ్ చేస్తున్నా. బెడ్, మల్చింగ్, డ్రిప్ సాయంతో ట్రేకింగ్ చేయడం వలన పెట్టుబడి పెరిగినా 50టన్నుల వరకు దిగుబడి వస్తుంది. గతంలో 10 ఎకరాల సాగులో వచ్చే దిగుబడులు ప్రస్తుతం ఒక ఎకరాలో వస్తుంది.

– రైతు ప్రభాకర్‌రెడ్డి, ఎన్కేపల్లి

ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి



గతంలో పసుపు నాగలి వెంట సాగు చేస్తుండేవారు. ఎకరాకు 15 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చేది. అనంతరం బోజ పద్ధతిలో సాగు చేశాం. రెండేళ్లుగా బెడ్, డ్రిప్ పద్ధతితో సాగు చేస్తున్నాం. విత్తనం తక్కువే పడుతుంది. ఎకరాకు ఐదు క్వింటాళ్ల విత్తనం సరిపోతుంది. గతేడాది ఒక ఎకరాలో బెడ్ పద్ధతిపై సాగు చేయగా 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

– రైతు మోహన్‌రెడ్డి, మోమిన్‌పేట

ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశభవిష్యత్

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే సత్తా ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విధులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని సూచించారు. ప్రభుత్వం సైతం విద్యావ్యవస్థ పటిష్టానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు వచ్చేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, వైస్ చైర్మన్ ఆయుబ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పార్టీ ఎ-బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

కుల్కచర్ల: ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చౌడాపూర్‌లో మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. బడులను బలోపేతం చేసేందుకు కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చౌడాపూర్, కుల్కచర్ల ఎంఈఓలు రాంచందర్, అబీబ్ అహ్మద్, ఎంపీడీఓ సోమలింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సీఆర్పీలు విజయకుమార్, రాఘవేందర్, ఇన్‌చార్జ్ ఎంపీఓ రాజిరెడ్డి, స్థానిక నాయకులు కొత్త ఉమాపతిరెడ్డి, నరసింహ నాయక్, బి.వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.


సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్

- పట్టణ పరిశుభ్రతను కాపాడుదాం
- మున్సిపల్ కమిషనర్ యాదగిరి


మార్నింగ్ వాక్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ యాదగిరి

తాండూరు టౌన్: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే మార్నింగ్ వాక్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ యాదగిరి చెప్పారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఇందిరానగర్, రహ్మత్‌నగర్, హమాలీ బస్తీ, గుండుపీర్ల ప్రాంతంలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను అడిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణాన్ని స్వచ్ఛత, పరిశుభ్రత పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇందుకు వారంలో రెండు వార్డులను ఎంపిక చేసుకుని ఆయా వార్డుల్లో మార్నింగ్ వాక్ చేసి, ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రిక్, వాటర్ సప్లై, శానిటేషన్ తదితర విభాగాల అధికారులతో వార్డుల్లో పర్యటిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎలాంటి సమస్యలున్నా వార్డు ఆఫీసర్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు సైతం పట్టణం పరిశుభ్రంగా ఉండేందుకు తోడ్పాటునందించాలన్నారు. విధిగా తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే దోమలు, ఈగలు చేరి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, వెంకటయ్య, వార్డు ఆఫీసర్లు, జవాన్లు, పలు శాఖల అధికారులు, సిబ్బంది మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ


తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న ప్రభుత్వ సర్వేయర్ మహేశ్

తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో లైసెన్స్ సర్వేయర్లుకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంలో వీరు కీలక పాత్ర పోషించనున్నారు. ఈ సర్వేయర్లు మొదటి దఫా శిక్షణలో భాగంగా 50 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ సర్వేయర్ వద్ద మరో 40 రోజుల పాటు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ నెల 25తో వీరి శిక్షణ పూర్తికానుంది. మంగళవారం ప్రభుత్వ సర్వేయర్ మహేశ్ 11 మంది సర్వేయర్లకు పట్టా ల్యాండ్ సర్వే నంబర్, డిమార్కేషన్, మోకా పంచనామా రిపోర్టు తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి అక్టోబర్ 3వ తేదీన అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రభుత్వం లైసెన్స్ ఇవ్వనుంది. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బాబు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ద్విచక్రవాహనం

యువకుడి దుర్మరణం

మీర్‌పేట: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా.. మరో యువకుడు గాయపడ్డారు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. ప్రశాంతిహిల్స్‌కు చెందిన భూపతిరెడ్డి కుమారుడు అక్షిత్‌రెడ్డి(21) డిగ్రీ పూర్తి చేశాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు రాజారామ్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై ప్రశాంతి హిల్స్ నుంచి అల్మాస్‌గూడ కమాన్‌వైపు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అక్షిత్‌రెడ్డి రోడ్డుపై పడిపోగా రాజారామ్ ఎదురుగా వస్తున్న స్కూటీపై పడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అక్షిత్‌రెడ్డి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



దిర్సంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో షీటీం ఇన్‌చార్జి నర్సింలు

షీటీం ఇన్‌చార్జి నర్సింలు

దోమ: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని షీటీం ఇన్‌చార్జి నర్సింలు అన్నారు. ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని దిర్సంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జీహెచ్ఎం రూప్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలతో పాటు గ్రామీణ ప్రాంత యువకులు, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులకు గురైనా 100, 181కు కాల్ చేయాలన్నారు. మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధాన్ని పూర్తి స్థాయిలో కట్టడి చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరమన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని నిషేధించాలన్నారు. సైబర్ క్రైమ్‌లో ఎలాంటి మోసాలు జరిగిన 1930కి కాల్ చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. శాంతియుత వాతవారణంలో ప్రజలంతా జీవనం సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు బి.సావిత్రి, ఉపాధ్యాయులు శివకుమార్, రాజు, రాము, విజయ, లావణ్య, ఎల్లారెడ్డి, రవీందర్, సర్దార్‌మియా, పీఈటీ గోపాల్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీలో సీట్లు భర్తీ

- విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు టాటా సంస్థ టెక్నీషియన్స్
- ఇప్పటికే విధుల్లో చేరిన నలుగురు అధ్యాపకులు



తాండూరు: పట్టణంలోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో ఆరు కోర్సులకు సీట్లన్నీ భర్తీ అయ్యాయి. 172 సీట్లకు గాను పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులతో పాటు ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇండస్ట్రియల్ రొబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్(ఒక సంవత్సరం), మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమెషిన్(ఒక సంవత్సరం, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్(ఒక సంవత్సరం), బీడీ వీపీ వర్చువల్ ఎనాలసిస్ అండ్ డిజైనర్ (రెండేళ్లు), సీఎస్‌సీ మెషినింగ్ టెక్నీషియన్(రెండేళ్లు), ఎలక్ట్రిక్ వెహికిల్ మెకానిక్ (రెండేళ్లు) కోర్సుల్లో ఏటీసీ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. తొలుత దరఖాస్తులకు ఆసక్తి చూపకపోవడంతో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు. దీంతో ఆరు కోర్సుల్లో అన్ని సీట్లు భర్తీ అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సాయన్న తెలిపారు. మరో మూడు రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. 11 మంది అధ్యాపకులకుగాను(టెక్నీషియన్స్) ఇప్పటికే నలుగురు విధుల్లో చేరారని చెప్పారు.

జిల్లా స్థాయి టీఎల్ఎంకు బాటసింగారం పాఠశాల

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలో మంగళవారం బోధనోపకరణాల మేళా(టీఎల్ఎం మేళా)ను అట్టహాసంగా నిర్వహించారు. ఎంఈఓ జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మేళాలో మండల పరిధిలోని 52 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని బోధనోపకరణాలను ప్రదర్శించా రు. ఇంగ్లిష్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బాటసింగారం జెడ్పీహెచ్ఎస్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు.

లింగంపల్లిలో యూపీ బృందం పర్యటన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కన్సల్టెంట్లు మంగళవారం మండల పరిధిలో లింగంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలు బతుకమ్మ పాటలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వారికి వివరించారు. పేదరిక నిర్మూలన, జీవనోపాధి వృద్ధి పంచాయత్, పెన్షన్లు, పంచాయతీల పనితీరు, మిషన్ భగీరథ నీళ్లు, నర్సరీల నిర్వహణ, సర్పంచులు, అధికారుల పాత్ర తదితర విషయాలను ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల అధికారులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీడీవో అనురాధ, ఎంపీఓ విజయ్కుమార్, ఏఓ జ్యోతి, ఏపీఓ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకే సామాజిక తనిఖీలు


సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపిస్తున్న డీఆర్‌పీ

మర్పల్లి: ఉపాధి హామీ పథకంలో అవినీతికి చోటు లేకుండా చూసేందుకే ప్రభుత్వం సామాజిక తనిఖీలు నిర్వహిస్తోందని మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం 11నుంచి రాత్రి 10.20 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024 మార్చి 1నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులను ఓపెన్ ఫోరంలో చదివి వినిపించారు. 27 పంచాయతీల్లో రూ.12 కోట్లకు పైగా విలువ చేసే పనులకు సంబంధించి ఉపాధి పథకం కింద కూలీలకు డబ్బులు చెల్లించారన్నారు. అవకతవకలకు పాల్పడిన పలువురు గ్రామాల బాధ్యులకు రూ.30 వేల చొప్పున పెనాల్టీ విధించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, డీఆర్‌డీఓ అంబుడ్స్ మెన్ గుర్రం రాములు, అడిషనల్ పీడీ సరళ, ఏపీఎం భార్గవి, ఎంపీడీఓలు సీటి జయరామ్, రాజమల్లయ్య, ఎస్ఆర్‌సీ ముత్తు, ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

మొయినాబాద్: భర్తతో గొడవపడి కూతురుతో కలిసి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఎనికేపల్లికి చెందిన గుగులోత్ సునీత ఈ నెల 13న భర్త మోహన్‌నాయక్‌తో గొడవపడి కూతురు మీనాక్షిని తీసుకుని ఇంట్లోంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో భర్త పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పొరిగింటి వారితో గొడవపడి గృహిణి..

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరామ కాలనీలో పోచన నర్సింలు, భార్య మహేశ్వరి(44) నివాసం ఉంటున్నారు. పొరుగింటికి చెందిన వ్యక్తి కారును వీరి ఇంటి ఆవరణలో పార్కు చేస్తుండడంతో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీనా సైతం మహేశ్వరి పొరుగింటి వారితో గొడవ పడిన విషయం తెలుసుకున్న నర్సింలు ఆమెను మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎంతకీ రాకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- మూగజీవాలు అపహరిస్తున్న ముఠాకు రిమాండ్
- రూ.2.62లక్షల నగదు, నాలుగు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ


స్వాధీనం చేసుకున్న వాహనాలు

షాద్‌నగర్‌రూరల్: మూగజీవాలను అపహరిస్తున్న ముఠాను షాద్‌నగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని సుల్తాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పరిగి పట్టణానికి చెందిన అబ్దుల్ ఖలీం, మహ్మద్ సోహెల్, షేక్ రవూఫ్, మహ్మద్ జమీర్, కర్ణాటక రాష్ట్రం చౌడ్‌గుప్ప జిల్లా కోదంబాల్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆరీఫ్, హైదరాబాద్‌లోని పహడీషరీఫ్‌కు చెందిన షేక్ హసనుద్దీన్, జియాగూడకు చెందిన సాయికిరణ్‌తో స్నేహం ఏర్పడింది. వీరంతా జల్సాలకు అలవాటుపడి చోరీల బాటపట్టారు. ఈ ఎనిమిది మంది ముఠాగా ఏర్పడి ఉదయం కార్లలో తిరుగుతూ మేకలు, గొర్రెలు ఎక్కడెక్కడ ఉన్నాయో రెక్కీ నిర్వహిస్తారు. రాత్రివేళ వాటిని అపహరించి జియాగూడ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

82 మేకలు.. 67 గొర్రెల అపహరణ

ఈ ముఠా షాద్‌నగర్‌పరిధిలోని చించోడ్ పటేల్‌కుంట తండాలో ఎనిమిది, పీర్లగూడలో రెండు మేకలు, సోలీపూర్‌లో 21 గొర్రెలు, చౌదరిగూడలో ఎనిమిది మేకలు, పెద్ద ఎల్కిచర్లలో 23 మేకలు, తంగెళ్లపల్లిలో ఎనిమిది మేకలు, వెంకిర్యాలలో ఎనిమిది గొర్రెలు, కుల్కచర్లలో ఎనిమిది గొర్రెలు, పరిగి మండలం నాయికోటివాడలో 12 మేకలు, సుల్తాన్‌పూర్‌లో 30 గొర్రెలు, దోమ మండలం ఉదన్‌రావుపల్లిలో 15 మేకలు, దిర్సంపల్లి తండాలో ఆరు మేకలు దొంగిలించినట్లు తెలిపారు. పీర్లగూడకు చెందిన బొగ్గుల ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక నైపుణ్యం ఆధారంగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ విజయ్‌కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ పవన్‌కుమార్, ఎస్ఐ భూపాల్, అవినాశ్‌బాబు, శివారెడ్డి, సిబ్బంది కుమార్, మహేందర్, నవీన్, రమేష్, రవి, భీమయ్య, కరుణాకర్, మోహన్‌లాల్, జాకీర్, రాజు, సంతోష్‌లు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించినట్లు తెలిపారు. వీరికి తగిన రివార్డును అందించనున్నట్లు ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు.